


# పరిష్కారం దొరికింది

- దావులూరి జయలక్ష్మి

జానకి తన ఆలోచనలు ఎటు వెళుతున్నాయో ఆమెకే తెలియని స్థితిలో వుంది. కంటి మీదకు కునుకు రావడంలేదు. ప్రక్కన పడుకున్న భర్త రామారావును చూసింది. హాయిగా నిద్రపోతున్నాడు. పగలు అలసిన శరీరానికి విశ్రాంతినిస్తున్నాడు. ఆలోచనలతో సతమతమయిన మెదడుకు విరామమిస్తున్నాడు. నిద్ర సుఖమెరుగదంటారు. నిజమేననిపించేటట్లు నిర్వికారంగా నిద్రపోతున్నాడు.

అతన్ని చూస్తే జానకికి వళ్ళు మండిపోయింది. ఎలా నిద్రపోతున్నాడో చూడు, అసలు నిద్ర ఎలా పడుతోంది? నేనిలా బాధపడుతుంటే ఆ మనిషికి చీమ కుట్టినట్టుగా కూడా లేదా? అని విసుక్కుంది. ఆ విసుగులో కాస్త అసూయ కూడా వుండే వుంటుంది.

అసలు జానకి పరిస్థితి ఈ మధ్యకాలంలో ఇలాగే వుంటోంది. పేరంటాలకు వెళ్లడం మానుకుంది. ఏ వేడుకలకు ఉత్సాహంగా వెళ్లడంలేదు. మరీ తప్పని సరైతేనే వెళుతోంది. తిండి మీద, అలంకరణ మీద కూడా ఆసక్తి తగ్గిపోయింది. ఒకరికొకరు ప్రాణంగా ఉండేవారు. అలాంటిది ఇప్పుడు భర్త విషయంలో కూడా శ్రద్ధ తగ్గింది. అంతేకాదు, ఆయన ఏదన్నా అడిగినా, మాట్లాడినా విసుగే అనిపిస్తోంది.

మళ్ళీ తర్వాత తనకు తానే ఆలోచించుకుంటుంది. పాపం ఆయన చేసిన నేరమేమిటి? నన్ను ఎంత ప్రేమగా చూసుకుంటారు? ఏనాడన్నా విసుక్కుని ఎరుగునా? నేనన్న దానికి కాదని ఎరుగునా? మరి ఎందుకు నాకు ఇలా తరచూ కోపం వస్తోంది?

***

జానకి కళ్ళముందు తన మరదలు మానస కనబడింది. ఆవిడ ఒడిలో పసివాడు. బాలింతరాలుగా చెవులలో దూది, తలకు గాలి తగలకుండా మఫ్లర్. నడికట్టుతో ఎంతో దర్పంగా వుంది. బారసాల పీటలమీద కూర్చుని మానస తనవైపు చూచిన చూపులో ఆత్మీయత కంటే హేళనే ఎక్కువ కనిపించింది.

బాబును తాను ఎత్తుకోబోతుంటే-

"ఉండండి వదినా! మీకు అలవాటులేదుగా. ఇదిగో ఇలా ఎత్తుకోండి'' అంటూ తన చేతుల్లో పెట్టింది.

అప్పుడు తన ముఖం తనకే వికారంగా కనిపించింది. బారసాలకు వెళ్లానన్న ఆనందంకన్నా మరదలు మాటలు ఏమిటో గుచ్చుకున్నట్లుగా వున్నాయి.

నిజమే తనకు అలవాటులేదు. మరి మానసకు ఇదే తొలి కాన్పుకదా! ఆమెకు అలవాటు వుందా? అయినా తను చిన్నప్పటి నుండి పసిపిల్లలను ఎత్తుకు మోసేదని ఆమెకేం తెలుసు? అందుకే దేవుడిట్లా చేసాడు.

పెళ్లయి ఆరేళ్ళయింది. ఇంతవరకూ పిల్లలు లేరు. దానికి తనేం చేస్తుంది? అది తన తప్పా?

పెళ్లయిన ఏడాదికే మానసకు కొడుకు పుట్టాడు. అది ఆమె అదృష్టం. అంతమాత్రంచేత ఇతరులను నొప్పించాలా? దానివలన వారికొరిగేదేమిటి?

సుగుణ పెళ్లిలోనూ అంతే! ఎవరో ఆమె తనకు ముక్కూ మొహం కూడా తెలియదు. అయితేనేం పలకరించి మరీ



## హలో...

"హలో! నేను నా ఇంటిని ఇన్స్యూర్ చేయించాలని అనుకుంటున్నా. ఫోన్ ద్వారా చేయవచ్చా!"

"కుదరదు. మేం మనిషిని ఇంటికి పంపిస్తాం!"

"అయితే త్వరగా పంపండి. ఇక్కడ నా ఇల్లు తగలబడిపోతోంది."

## అలవాటు

విమానంలో పక్కన కూర్చున్న భార్యతో మంత్రిగారు–

"అప్పడాల కర్ర కూడా ఎందుకే?" అన్నాడు.


"బాగుందండీ! అలవాటైంది. అక్కడ కొత్త పరికరాలున్నా నాకు అలవాటుండదుకదా! అప్పడాల కర్రయితే గురి తప్పదు."

## సరసం


కిరాణా షాపుకి బయల్దేరిన భార్యతో "ఒసేవ్! ఈ వీధి చివర కొత్తగా పెట్టిన మన్మథ కిరాణా స్టోర్స్‌కి మాత్రం వెళ్లకు సుమా" అన్నాడు అనుమానాలరావు.

"ఏం?" అడిగింది భార్య.

"వాడు... 'సరుకులు సరసముగా అమ్మబడును' అని బోర్డు పెట్టుకున్నాడు. ఏ వెధవ్వేషాలేస్తాడో ఏమో!"



–భూక్యా గోపీనాయక్
(చిలకలూరిపేట)




అడిగింది 'పిల్లలెంతమంది?' అని.

తన జవాబు విని 'అయ్యో! అలాగా.. డాక్టర్‌కి చూపించుకోలేకపోయావా?' అని ఓ సలహా కూడా పారేసింది. అంతటితో ఆగినా బాగుండును అప్పుడే ప్రక్క ఆమెతో చెబుతోంది "పాపం పిల్లలు లేరట!' ఈ పాపం ఏమిటో తనకు అర్థంకాలా? వళ్ళు మండిపోయింది.

ఎక్కడికి వెళ్లినా ముందు ఇదే ప్రశ్న ఎదురవుతోంది. అందుకే తను ఎక్కడికీ వెళ్లడం కూడా మానుకుంది.

తనలో ఆరాటం ఎక్కువైన తరువాత డాక్టర్‌కు చూపించుకున్నారు. పరీక్షలు చేసారు. తనలో ఏ లోపం లేదుట. కానీ ఆయన స్పెర్మ్‌లో వీర్యకణాలు చాలా తక్కువగా ఉన్నాయిట. తమకు పిల్లలు పుట్టే అవకాశం చాలా తక్కువన్నారు.

ఇది తమ సమస్య. అందరికీ చెప్పుకోవలసిన అవసరం లేదుగా. అసలు ఎందుకు చెప్పుకుంటారు!

తనను గొడ్రాలిగా భావించి హేళనగానో, జాలిగానో చూస్తుంటే భరించలేకపోతోంది. అందుకేనేమో ఈ అసహనం. అయినా తను కంట్రోల్ చేసుకోలేకపోతోంది. ఆయన ఎడల కూడా నిర్లక్ష్యం ఏర్పడడానికి ఇదే కారణం కావచ్చు.

ప్రేమగా మాట్లాడలేకపోతోంది. నవ్వుతూ ఉండలేకపోతోంది.

భార్య బాధ రామారావు అర్థం చేసుకున్నాడు. అందుకే పదే పదే ఎటన్నా తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ దేనికి జానకి సుముఖత చూపడంలేదు. పైగా 'అదొక్కటే తక్కువైంది మనకు' అంటుంది. ఆ మాట అతనిలో ముల్లులా గుచ్చుకుంటుంది. కానీ అతనేం చేయలేకపోతున్నాడు. పైగా తన అసమర్థతవల్ల భార్యలో అసంతృప్తి కలిగిందేమోనన్న బాధ అతనిలోనూ రగులుతోంది. దాంపత్యం సుఖం అందుకోలేకపోతున్నారు.

రామారావుతో ఘర్షణ మొదలైంది. దాంపత్యానికి పిల్లలే ముఖ్యమా? పిల్లలు కలుగకపోతే వాళ్ళు ఎందుకూ పనికిరాని వాళ్లేనా? జీవితాన్ని అనుభవించలేరా? ఒకరికొకరు తోడూ నీడలా ఉండి ఆనందాన్ని అందుకోలేరా? జానకి ఇలా ఎందుకు ఆలోచించలేకపోతోంది?

పెళ్లినాటి నుండి తాము ఎంతో ఆనందంగా గడిపారు. పొరపొచ్చాలు లేకుండా సంసారం సాఫీగా గడిచింది. ఒకరంటే మరొకరికి ప్రేమ, అభిమానం ఉన్నాయి. మరెందుకు ఈ ఒక్క కారణంతో జానకి ఇలా మారిపోతోంది? తను మగవాడిని కానట్టే ప్రవర్తిస్తోంది!

తనూ చదువుకుంది. చేయాలంటే ఏదో ఓ ఉద్యోగం చేయవచ్చు. కాదనుకుంటే ఏ సోషల్ వర్క్ అయినా చేయవచ్చు. తనకూ ఏదయినా ఓ వ్యాపకం వుంటే ఇలా ఆలోచిస్తూ కూర్చోదేమోనని పిస్తుంది. కానీ వాటికి వీటికీ జానకి సుముఖంగా లేదు. ఇలా ఒకే గూటిలో ఎడమొగం పెడమొగంగా గడపడం తనవల్ల కావడంలేదు. ఏదో ఒక పరిష్కారం చూడాలి. అతని ఆలోచనలు ఇలా సాగాయి. ఆ ఆలోచనలు తీవ్రరూపం దాల్చి పరిష్కారమార్గం కోసం అన్వేషణ సాగింది.

***

ఒకరోజు జానకిని పిల్చి "కూర్చో!" అన్నాడు.

జానకి 'ఏమిటి?' అన్నట్లు అసహనంగా కూర్చుంది.

"చూడు జానకీ! నేను చెప్పేది జాగ్రత్తగా విని ఆలోచించు. నీ మనసులో బాధ నేను అర్థం చేసుకోగలను. కానీ అది నా చేతుల్లో లేని పని. అయినా నీ తప్పుకాదు. అన్వేషించిన మార్గాలే నీకు చెబుతాను. నీకు ఏది బాగా అనిపిస్తే అది చేయి. నీకిష్టమైన మార్గం నాకూ మనస్ఫూర్తిగా ఇష్టమే. ఏమంటావ్?" అన్నాడు.

"అసలు సంగతేమిటో చెప్పండి. ఈ ఉపోద్ఘాతం ఎందుకు?" అంది విసుగ్గా.

"అదే! ఆ విసుగే లేకుండా స్థిమితంగా వింటావని, వినాలనే ఇదంతా చెప్పింది" అన్నాడు.

జానకి, రామారావు ముఖం వంక ఒకసారి చూసింది. తల దించుకుని "చెప్పండి" అంది శాంతంగా.

జానకిలోని మార్పు రామారావుకు తృప్తినిచ్చింది.

"మొన్న డాక్టర్‌గారిని కలిసాను" రామారావు కాస్త ఆగాడు.

జానకి ఓసారి అతనివంక చూసి తల దించుకుంది.

"నీ బాధ చూడలేకపోతున్నాను జానకీ! అందుకే ఆయనేమన్నా పరిష్కార మార్గం చూపిస్తారేమోనని వెళ్లాను. ఇప్పుడు ఏవో చాలా పద్ధతులు వచ్చాయి కదా! అవి మనకేమన్నా ఉపయోగపడతాయేమోనని ఆలోచన" రామారావు చెప్పడం ఆపి జానకి ముఖం వంక చూసాడు.

ఆమె ఆసక్తిగా తలెత్తి చూసింది.

"రిపోర్టులన్నీ పరిశీలించారు. సెమెన్ టెస్ట్‌లో వీర్యకణాలు... అదే అసలు లేనట్లేనని వచ్చిన రిపోర్టు సంగతి... నీకూ తెల్సుగా! టెస్టిక్యులర్ బయాప్సీలో కూడా అసలు... వీర్యకణాలు తయారుకావడంలేదని కూడా వచ్చిన రిపోర్టు సంగతి నీకు తెలుసుగా!"

రామారావు కంఠం రుద్ధమయింది. ఆ కనురెప్ప

లలో దాగిన కన్నీరు కనబడకుండా జాగ్రత్తపడ్డాడు.

జానకి మనసు వికలమయింది. భర్త ఇంత బాధప డుతున్నాడా? మనసులో ఏ మూలో ఆర్ద్రత తొంగి చూసింది.

"అందుకే ఆయన ఓ సలహా ఇచ్చారు" రామారావు చెప్పడం కొనసాగించాడు.

"ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ డోనార్ పద్ధతిలో అంటే దాత వీర్యంతో కృత్రిమ పద్ధతి ద్వారా ప్రయత్నించడం."

జానకి చివ్వున తలెత్తి చూసింది. ఆమె ముఖం కందగడ్డగా అయింది.

"అంటే మీ ఉద్దేశ్యం? నేను...నేను..."

రామారావు నవ్వాడు. ఆ నవ్వులో జీవముందో లేదోగానీ కల్మషం మాత్రంలేదు.

"ఆగు జానకీ! నన్ను చెప్పనీ! నీవెందుకు అలా ఆలోచిస్తున్నావు? అసలు దాత ఎవరో కూడా మనకు తెలియదు. నీవు తల్లివవుతావు. మనకు బిడ్డ కలుగుతుంది."

జానకి పెదిమలు అదురుతున్నాయి. భర్త ఆలోచనకు విస్తుపోతోంది. ఇలాంటి మగాళ్ళు కూడా ఉంటారా? అన్నట్లు చూస్తోంది.

"అయితే ఖర్చు కాస్త ఎక్కువే అనుకో. అయితేనేం నీవు తల్లివవుతావు. నీ కళ్లల్లో ఆనందం కంటే కావాల్సిందేమిటి? అయితే ఒక్కసారి ప్రయత్నంలోనే సఫలీకృతం కాకపోవచ్చుట. అప్పుడు రెండు, మూడు ఒక్కోసారి నాలుగుసార్లు కూడా ప్రయత్నించవలసి రావచ్చుట. అయితేనేం ప్రయత్నిద్దాం. ఏమంటావ్?" అన్నాడు.

జానకి అతని మాటలకు ఇంకా తేరుకోనేలేదు.

"ఖర్చు గురించి ఆలోచించకు జానకీ! కొంత లోన్ తీసుకుంటాను. మరికొంత బయట ప్రయత్నిద్దాం. ఒకటి రెండు లక్షలలో అయిపోతుందట!" అన్నాడు.

'ఒకటి రెండు లక్షలా!' మనసులో జానకి ఆశ్చర్యపోయింది. అంత డబ్బు అప్పు చేసినా తాము తీర్చగలిగే స్థితిలో లేరు. అయినా భర్త తనకోసం అప్పు చేస్తానంటున్నాడు. అయినా 'దాత' అనే పదం ఎందుకో ఆమెను ముడుచుకుపోయేలా చేస్తోంది. అందుకే "ఊహూ...వద్దు!" అంది అతి మెల్లగా.

రామారావు జానకి మనసు చదవగలడు. ఆమె మనోభావం అతనికి అర్థమయింది. ఆమెపై ప్రేమ పొంగుతోపాటు జాలీ కలిగింది.

"పోనీ మరో పద్ధతి కూడా ఉన్నదట. కానీ అది నూటికి 25 శాతం మాత్రమే ఫలిస్తుందిట. అయినా ప్రయత్నం చేద్దామంటే చేద్దాము" ఆగాడు రామారావు.

"అదేమిటి?" అంది జానకి.

సాలోచనగా చూస్తూ చెప్పసాగాడు "సూటిగా వృషణాల నుండి బయాప్సీ తీస్తే ఒకటో రెండో పనికివచ్చే వీర్యకణాలు దొరికితే దొరకవచ్చుట. వాటితో ప్రయత్నించవచ్చునన్నారు" అన్నాడు నెమ్మదిగా.

జానకి ముఖం చిన్నబోయింది. వెంటనే తల దించేసుకుంది.

'అంటే...అంటే... ఇంకా ఇంకా పరీక్షలు చేసి నీవు పిల్లలు పుట్టడానికి ఏమాత్రం పనికిరాని చవటవని ముఖాన చెప్పించడానికా ఈ పరీక్షలు?' అది ఆయన భరించగలడా? అసలు తను భరించగలదా? వింటుంటేనే ఎలాగో వుంది. ఆ ప్రయత్నం విఫలమయితే? ఆయన పరిస్థితి ఏమిటి? ఇంక ఆలోచించలేకపోయింది.

వెంటనే "ఊహూ... వద్దు. ఇంక ఆ పరీక్షలు వద్దు" అంది.

రామారావుకు ఏం చేయాలో తోచలేదు. అయినా తను చెప్పదలచుకున్నది చెప్పాలి. జానకి కోరుకునే మాతృత్వం ఆమె పొందాలి. అది తనకు తృప్తి.

"పోనీ ఓ పని చేద్దాం జానకీ!" అన్నాడు.

ఏమిటన్నట్లు చూసింది.

"నువ్వు కోపం తెచ్చుకోకు. బాధపడకు. కాస్త ఆలోచించు. నా నిర్ణయం నీకు సరైనదే అనిపిస్తుంది" అన్నాడు.

'చెప్పండి' అన్నట్లు చూసింది.

"మనం విడాకులు తీసుకుందాం!" అన్నాడు.

తెల్లబోయింది జానకి.


"కలిసున్నన్నాళ్ళూ సుఖంగానూ, అన్యోన్యంగానూ వున్నాం. కానీ జీవితాంతం మాతృత్వం పొందలేదనే బాధతో నీవు గడపడం నాకిష్టంలేదు. ప్రతి స్త్రీ మాతృత్వం కోరుకుంటుంది. అది సహజం. అంతేకాదు, ప్రతి పురుషుడూ తండ్రి కావాలని కోరుకుంటాడు. కాకపోతే స్త్రీ బైటపడినంతగా పురుషుడు బైటపడడు. అంతే తేడా!

సంతానం లేకపోవడం స్త్రీ లోపమేనని లోకం భావిస్తుంది సహజంగా. అందుకే గొడ్రాలు అని ముద్ర వేస్తుంది. లోపం నీలో కాదు నాలో వుందని నీవు చెప్పగలవా? ఊహూ చెప్పవు, చెప్పలేవు.

అందుకే మనం విడాకులు తీసుకుందాం. అప్పుడు 'దాత' అనే పదం నీకు ఇబ్బందికరం కాదు. హాయిగా నీ భర్త నుండి సంతానం పొందే భాగ్యం లభిస్తుంది. ఏమంటావు?" అన్నాడు.

తను వింటున్నదేమిటో అర్థం చేసుకునేందుకు మెదడు మొద్దుబారి పోయింది జానకికి.

"ఇది తప్పేమీ కాదు జానకీ! నేటి సమాజంలోకి అలవాటుగా వస్తూ వున్నదే! మనం పోట్లాడుకోలేదు. ఒకరిమీద ఒకరు ద్వేషంతో నిందలు వేసుకుని విడిపోవడంలేదు. మన ఇద్దరికీ అంగీకారం



## నగ్నంగా గైడ్స్

మనం ఏదైనా దేశానికి వెళ్లినప్పుడు గైడ్ ద్వారా అన్ని సంగతులు తెలుసుకుంటాం. దేశం చూడ్డానికి, అన్నీ తెలుసుకోవడానికి గైడ్స్ చేసే ఉపకారం అంతా ఇంతా కాదు. అయితే బెర్లిన్ నగరం చూడాలని వచ్చిన పర్యాటకులకు ఇంకో అదనపు ఆకర్షణ కలిగిస్తున్నారు అక్కడి గైడ్స్. రాత్రివేళల్లో బెర్లిన్ అందాలు చెప్పనలవి కాదు. జర్మనీ వచ్చే టూరిస్టులందరికీ ఓ నైట్ క్లబ్ ఓనర్ నగ్నంగా వున్న ముగ్గురు టీనేజ్ ఆడపిల్లల్ని గైడ్స్‌గా మార్చి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ ముగ్గురమ్మాయిలూ బస్‌లో ప్రయాణించే పర్యాటకులకు ముఖ్యమైన ప్రదేశాలు చూపిస్తూ వాటి గురించి వివరిస్తూ వుంటే పర్యాటకులకు అక్కడి ప్రదేశాలపై ఇంట్రెస్టు కంటే ఈ నగ్నసుందరీమణులపై ఆపేక్ష కలుగుతోందిట. కాదా మరి... విదేశీ టూరిస్టుల బలహీనతను కనిపెట్టిన ఈ నైట్ క్లబ్ ఓనర్ ఇదే బావుందని నిర్ణయించేసుకుని మరింతగా తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నాడుట. ఓల్డ్ ఏజ్ హోమ్‌ల నుండి కూడా ఇతనికి ఆ గైడ్స్‌ని పంపమని ఫోన్స్ వస్తున్నాయిట. జన్నీ, నీకో అనే గైడ్స్ మాత్రం తమకి ఈ వృత్తి బాగా నచ్చిందని, ఇలాగే కంటిన్యూ అవుతామని చెప్తున్నారు. అవున్మరి ఈజీగా డబ్బు వస్తుంటే ఎవరికి చేదు? ఇదంతా చదివాకా మీకూ బెర్లిన్ వెళ్లాలని వుంది కదూ!

– శశి





## ఆత్మవిశ్వాసం

జయప్రద పేరు వినగానే ఆమె నటించిన సినిమాలెన్నో మనోఫలకంపై తారట్లాడతాయి. వయసు పెరుగుతున్నా అందాన్ని కాపాడుకోవడం జయప్రదకి బాగా తెలిసినట్టుంది. మొన్న మొన్నటి వరకూ ఇటు సినీనటిగా, అటు రాజకీయనాయకురాలిగా ద్విపాత్రాభినయం చేసిన జయప్రద ఇప్పుడు తన పూర్తికాలాన్ని సినిమాలపైనే నిలుపుతోంది. ఇందుకోసం తన అందానికి మరిన్ని మెరుగులు దిద్దుకుంటోంది. రాజ్ కుమార్ సంతోషి భారీ బడ్జెట్ చిత్రం 'ఖాకీ'లో ఆమె ఎంతో అందంగా కన్పించనుంది. హిందీలో రీమేక్ చేస్తున్న తెలుగు చిత్రం 'సత్తా'లో కూడా ఆమె నటిస్తోంది. మరిన్ని సినిమాల్లో నటించి మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటోందీమె. ఇప్పటివరకూ తాను పోషించిన పాత్ర కన్నా ముందుముందు కన్పించే పాత్రలే తనకి మంచి పేరు తెస్తాయంటోంది. ఆత్మవిశ్వాసంతో చెబుతున్న ఆమె మాటలు నిజమవుతాయేమో చూడాల్సిందే. అంటే ఇకనుంచి ఆమెలో ఓ కొత్త జయప్రదని చూస్తామన్న మాట.




వుంది కనుక కారణం సరైనదే కనుక మనకు విడాకులు కూడా త్వరగానే లభిస్తాయి'' అన్నాడు రామారావు.

జానకికి తల తిరిగిపోతోంది. రామారావు మంచితనం ఆమె భరించలేకపోతోంది. దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. గిర్రున లేచి వెనుదిరిగి గదిలోకి వెళ్లి తలుపులు భళ్ళున మూసుకుంది.

రామారావు మనసు స్థిమితపడింది. తను చెప్పదలచుకుంది చెప్పేశాడు. ఇప్పుడు కాస్త బాధపడినా తరువాత ఆలోచించుకుని జానకి 'సరే'నంటుంది. ఎక్కడ వున్నా జానకి సుఖమే తనకు కావాల్సింది. దీర్ఘంగా నిట్టూర్చాడు. జానకిని ఇప్పుడు వంటరిగా వదలడమే మంచిదనుకుంటూ బయటకు వెళ్లిపోయాడు.

***

జానకి ఆ రోజు నుండి ఆలోచిస్తూనే వుంది. తనను గురించి ఇంతలా ఆలోచించే భర్తను వదిలి తను విడాకులు తీసుకోవాలా? అసలు ఇంతవరకు తన ఆలోచనలలో భర్త ఎడల కలిగిన నిర్లక్ష్యమే ఒక నేరం అనుకుంటే విడాకులు తీసుకోవడం ఎంత క్షమించరాని నేరం. అసలు ఆ ఆలోచనే తన మనసులోకి రాలేదు. తను తట్టుకోగలదా? ఆయనను విడిచి తను ఉండగలదా? చికాకుతోనో, అసంతృప్తితోనో, లోకుల మాటలతోనో ఏదో కాస్త నిర్లక్ష్యంగా ప్రవర్తించిందేగానీ ఆయనమీద తనకు ప్రేమలేదా? ఆయనను విడిచి మరొకరితో తను సుఖపడగలనేనే ఆయన అనుకుంటున్నారా? ఎంత పిచ్చి ఆలోచన! తన నిర్లక్ష్యానికి ఇంత పెద్ద శిక్షా? ఆ ఆలోచనే భరించలేకపోతోంది.

***

జానకికి భర్త మీద ఇప్పుడు నిర్లక్ష్య భావంలేదు. కానీ అతనికి చేరువ కాలేకపోతోంది. ఏదో సంకోచం, ఏదో అపరాధభావం వెన్నంటి వెనక్కి లాగుతున్నాయి. భార్యాభర్తల మధ్య పూర్వపు అనుబంధం లేకపోయినా జానకి ప్రవర్తనలో మార్పు మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

అయినా ఆమె ఎన్ని పనులలో ఉన్నా ఆ ఆలోచన మాత్రం వెన్నాడుతూనే వుంది.

***

ఇప్పుడు జానకి దినచర్యలో మరో కార్యక్రమం చోటు చేసుకుంది. వీలు చిక్కినప్పుడల్లా దగ్గరలోవున్న భవానీ శంకరస్వామి దేవాలయానికి వెళ్లి వస్తోంది. అక్కడ ఆమెకు ఏదో ప్రశాంతత లభి స్తోంది. సాయంత్రాలు అమ్మ సన్నిధిలో గడపడం అధికమవుతోంది.

ఆ రోజు గుడికి వెళ్లాలని స్నానం చేస్తోంది. ఆమె ఆలోచనలలోకి చటుక్కున వినాయకుడు వచ్చి కూర్చున్నాడు. పిండి బాలుడు, అమ్మ ఆజ్ఞ, శివుని కోపం, గజానన ముఖం, గణాధ్యక్ష పదవి, ఆదిదంపతుల ముద్దుబిడ్డ, తొలిపూజ అందుకోవడం ఇలా అన్నీ కళ్లముందు సినిమా రీలుగా తిరిగాయి. భవానీ మాత లోక మాత. అందరూ ఆమె బిడ్డలే. ఆమె చల్లని చూపు, కరుణా దృష్టి, అమ్మ మనసు.

అమ్మ మనసు... అమ్మ మనసు... అక్కడ ఆగిపోయాయి జానకి ఆలోచనలు.

***

లలితా సహస్ర నామ స్తోత్రం పఠిస్తూ అమ్మ సన్నిధిలో ఏకాగ్రతతో ఉన్న జానకికి సమయం తెలియలేదు.

"అమ్మా! గుడి మూసే వేళయింది'' అన్నారు అర్చకులు.

తలెత్తి చూసింది. సమయం ఎనిమిదిన్నర.

'చాలా లైటైందే?' అనుకుంది. అయినా అమ్మ సన్నిధి నుండి కదలి రాబుద్ధి కావడంలేదు. కదలక తప్పదు కనుక మెల్లగా లేచి అమ్మను తనివితీరా మరోమారు చూసుకుని వెనుదిరిగింది. ఏదో అవ్యక్తమైన అనుభూతి.

మెట్లు దిగి నాలుగడుగులు వేసింది. ఎక్కడో సన్నగా ఏడుపు వినిపించింది. నడక ఆపి మళ్లీ విన్నది. నిజమే ఏడుపే. మళ్ళీ వింది. ఏడుపు వినిపించిన వైపు గబగబా నాలుగడుగులు వేసింది. అమ్మ గర్భగుడి వున్నవైపు ప్రాంగణం గోడకు దగ్గరలో గుడ్డల మూట లాంటిది. అక్కడ నుండే సన్నగా ఏడుపు. గబగబా గుడ్డలు విప్పింది. పసిబిడ్డ. అమాంతం ఎత్తుకుని గుండెలకదుముకుంది. ఆమెలోని మాతృత్వం పొంగింది.

గుడికి వెళ్ళేటప్పుడు ఇక్కడ ఈ బిడ్డలేదు. ఇప్పుడు... ఎవరో...పాపం... ఈ బిడ్డను ఇలా...!

కాదు కాదు నా కోసమే ఈ బిడ్డ పుట్టింది.

బిడ్డలేని తల్లికి తల్లి లేని బిడ్డ... అమ్మ ఇచ్చిన బిడ్డ. అమ్మే ఇచ్చిన బిడ్డ.

బిడ్డను అక్కున చేర్చుకుని గబగబా అడుగులేసుకుంటూ ఇంటిదారి పట్టింది.

తలుపు తీసిన రామారావు బిడ్డతో జానకిని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. అతన్ని చూస్తూనే ఆనందంతో "మన బిడ్డండి... మన బిడ్డ'' అంది.

ఆప్యాయంగా, అపురూపంగా ఆ బిడ్డను అందుకున్నాడు రామారావు.

జానకి విజేతగా తలెత్తి భర్త ముఖంలోకి చూసింది.

అనురాగంతో భార్యను అక్కున చేర్చుకున్నాడు రామారావు.

★